
# సూర్య


నేటి దినపత్రిక

www.suryaa.com


18 వ వసంతంలోకి



మెదక్



సంగారెడ్డి



సిద్దిపేట

శనివారం 22 ఫిబ్రవరి 2025


## ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు
## : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి





మెదక్ మేజర్ న్యూస్ ప్రతినిధి....రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఫిబ్రవరి 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. శుక్రవారం మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం మరియు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించిన ఏర్పాట్లపై అన్ని ఆయా జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ స్లిప్పులు పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. జిల్లాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు పాటించాల్సిన నియమాలు వివరాలు ఏర్పాటు చేయాలన్నారు.ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్, ఎస్పి ఉదయ్ కుమార్ రెడ్డి , అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్లిప్పులు పంపిణి సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని మెదక్ జిల్లా వ్యాప్తంగా ,ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు-21 ఉండగా ,1347 మంది ఓటర్లు, తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఈనెల 11 వ తారీఖున పీవోస్, ఏపీవోస్ ట్రైనింగ్ నిర్వహించుకున్నామని, 21-02-2025 రోజున రెండో విడతగా పీవోస్ ఏపీవోస్ఓపిఓస్ ట్రైనింగ్ పూర్తి అయిందని తెలిపారు. మైక్రో అబ్జర్వర్స విషయంలో 22 మందిని నియమించుకున్నామని తెలిపారు.మైక్రో అబ్జర్వర్కు శిక్షణ ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో సంబంధిత , ఎన్నికల విభాగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలి: జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి




- ఎమ్మెల్సీ ఎన్నికలు ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికల కంటే విభిన్నం.
- ఎన్నికల నిబంధనాలపై సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలి.
- 26న ఉదయం 8 గంటలకే ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలి.
- 27న ఉదయం 8 నుండి సాయంత్రం 4 వరకు ఎమ్మెల్సీ ఎన్నికలు.
- బ్యాలెట్ పద్ధతిలో ఎమ్మెల్సీ ఎన్నికలు.
- కరీంనగర్ రిసెప్షన్ సెంటర్లో బ్యాలెట్ బాక్సులు, పేపర్లు ఎన్నికల సామాగ్రి అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లది.
- కలెక్టరేట్లో ఎన్నికల సిబ్బందికి రెండో విడత శిక్షణ.

మిగతా 8లో

## కృత్రిమ మేధా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం

◆ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఆరు జిల్లాల్లో పగడ్బందీగా అమలు. ◆ యోగిత రనా హైదరాబాద్ నుండి జూమ్ మీటింగ్ ద్వారా ఆదేశాలు



సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి...కృత్రిమ మేధా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఆరు జిల్లాల్లో పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా హైదరాబాద్ నుండి జూమ్ మీటింగ్ ద్వారా ఆదేశించారు. శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ జూమ్ మీటింగ్లో పాల్గొన్నారు. విద్యాశాఖ సెక్రెటరీ యోగితారాన కృత్రిమ మేధా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం పై పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన 06 జిల్లాల జిల్లా కలెక్టర్లకు జూమ్ మీటింగ్ ద్వారా పలు సూచన చేస్తూ కృత్రిమ మేధ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నారాయణపేట, మేడ్చల్, భూపాలపల్లి, ఈ ఆరు జిల్లాల్లో ఒకో జిల్లాకు ఆరు పాఠశాలను ఎంపిక చేసి అమలు చేయాలన్నారు.ప్రాథమిక స్థాయిలో అభ్యసనా సామర్థ్యాలు పెంపుకై పిల్లలు చదవడం రాయడం సంబంధించి కృత్రిమ మేధా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసి ఈ ల్యాబ్ లో కుత్రిమ మేధా సాఫ్ట్వేర్ను పొందుపరిచి విద్యార్థిని, విద్యార్థులు చదవడం రాయడం ఇటువంటి సామర్థ్యాలు పెంపొందించుటకై విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. కృత్రిమ మేధతో విద్యార్థులు ఎలా ఆలోచిస్తున్నారో అర్థం చేసుకోగలిగే లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ను కూడా నిర్మించవచ్చని చెప్పారు.ఈ జూమ్ మీటింగ్లో పాల్గొన్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ కృత్రిమ మేధా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలు చేసే విధానం దీనికి కావలసిన వసతులు సమీకరించుకుని జిల్లాలోని 06 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలైన తూప్రాన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మనోరాబాద్ మండలం కాళ్ల కళ్ళు మండల పరిషత్



ప్రాథమిక పాఠశాల, నర్సాపూర్ నెంబర్ -02 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నిజాంపేట్ మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాల, మాసాయిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసిన ఆరు పాఠశాలలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసుకుని మానిటరింగ్ చేయడం జరుగుతుందని విద్యాశాఖ సెక్రెటరీ యోగితా రానా కు కలెక్టర్ వివరించారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలు
### సజావుగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి




మిగతా 5లో

# బిజెపి తోనే సుస్థిర పాలన అభివృద్ధి

## బిజెపి ఎమ్మెల్సీలు గెలుపుతో సమస్యల పరిష్కారం: సంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పత్రి రామకృష్ణ



పెద్ద శంకరంపేట్ మేజర్ న్యూస్ : భారతీయ జనతా పార్టీతోనే సుస్థిర పాలన అభివృద్ధి సాధ్యమవుతుందని సంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ.. పేట మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు.. శుక్రవారం పెద్ద శంకరంపేటలో పట్టభద్రుల బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్యలను గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.. అనంతరం వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఎమ్మెల్సీల అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పేర్కొన్నారు.. ఉపాధ్యాయ తరఫున.. పట్టభద్రుల తరఫున ప్రశ్నించే గొంతుకలైన బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తూ వివరించారు.. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజా గౌడ్ జ్ఞానేశ్వర్.. మండల బిజెపి ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్.. బీజేవైఎం అధ్యక్షుడు బొగుడాల కృష్ణ.. తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే వ్యక్తిని ఎమ్మెల్సీగా ఎన్నుకోండి : ఎస్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు పర్వత రెడ్డి

పెద్ద శంకరంపేట మేజర్ న్యూస్ : ఉపాధ్యాయ అధ్యాపకుల సమస్యల పై అవగాహన ఉన్న కూర రగోతం రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు పర్వత్ రెడ్డి అన్నారు శుక్రవారం పెద్ద శంకరంపేట మండలంలో కూర రగోతం రెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు అనంతరం ఎస్టియు భవనంలో విలేకరులతో మాట్లాడారు కరీంనగర్ అదిలాబాద్ మెదక్ నిజాంబాద్ ఎమ్మెల్సీ నియోజకవర్గం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గత ఆరు సంవత్సరాల ఎమ్మెల్సీగా ఉండి ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి రగోతం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు అధ్యాపకుల ఉపాధ్యాయుల సమస్యలు ఎన్నో పెండింగ్లో ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా ఎస్టీయూ పనిచేస్తుందని సమస్యలపై అవగాహన ఉన్న కూర రగో త్తమ్ రెడ్డికి ఎస్ టి యు మద్దతిస్తుందని అన్నారు 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూర రఘో



త్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా మాజీ అధ్యక్షులు బోండ్ల శ్రీనివాస్ విశ్రాంత ఉపాధ్యాయులు పి ఆర్ టి యు జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు రామచంద్ర చారి ఎస్ టూయూ మండల అధ్యక్షులు శ్రీనివాస్ ఆర్థిక కార్యదర్శి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ఘనంగా రజతోత్సవ వేడుకలు



సంగారెడ్డి, మేజర్ న్యూస్: పట్టణంలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో 25 వసంతాల రజతోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ భువనగిరి ఫణి పవన్ శాస్త్రి (ఫౌండర్ & సీఈఓ - ఈ అభ్యాస్) విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ, "విద్యార్థులు జీవితంలో ఎదగడానికి తగిన సమయం ఇవ్వాలి. తమ లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలి" అని సూచించారు. సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేత ఈదర సలోమోన్ రెడ్డి మాట్లాడుతూ, "విద్యయొక్క గొప్పదనం, దాని ప్రాముఖ్యతను" విద్యార్థులకు వివరించారు. కార్యక్రమ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. అనంతరం విద్యార్థులు స్వాగత గీతంతో కార్యక్రమాన్ని ఆరంభించారు. ప్రీ-ప్రైమరీ విద్యార్థులు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. ఈ కార్యక్రమంలో అతిథులుగా దినేష్ రెడ్డి (లీడ్ అకాడమిక్ డైరెక్టర్), ముని చౌదరి, కుమారి వరలక్ష్మి (అకాడమిక్ డైరెక్టర్ & ఎక్సలెన్స్ అడ్వైజర్), ప్రిన్సిపాల్ అరుణా రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జయబాలరెడ్డి, డైరెక్టర్ విజయ కుమార్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి రెడ్డి స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ముగ్గురు కార్మికులు

## ప్రాణాపాయ స్థితిలో యశోద ఆసుపత్రికి తరలింపు - ఘటనపై కేసు నమోదు

జిన్నారం మేజర్ న్యూస్:జిన్నారం మండలం కాజిపల్లి పారిశ్రామిక వాడలోని హేటిరో ల్యాబ్స్ పరిశ్రమలో గురువారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదం పాఠకులకు తెలిసిందే.ప్రమాదంపై సమాచారం అందుకున్న బొల్లారం సిఐ ఎం. రవీందర్ రెడ్డి ఘటనా స్థలాన్ని చేరుకొని పరిశీలించారు.పరిశ్రమలోని హెచ్ బ్లాక్ ఏ ఎన్ ఎఫ్ డి ఏరియా డ్రైయర్ వద్ద ఇంటర్మీడియట్ పౌడర్ అన్లోడింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడే పని చేస్తున్న పరిశ్రమ ఉద్యోగి సిహెచ్ వీర వెంకట్ రెడ్డి(49), బీహార్ కు చెందిన కార్మికులు శేషు కుమార్ (29), శైలేంద్ర ప్రసాద్ (38) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ముగ్గురిని పరిశ్రమ యాజమాన్యం సికింద్రాబాద్ లోని యశోద ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. కాగా దాదాపు 40% శాతం కాలిన గాయాలతో కార్మికులు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టారు.గతంలోనూ పరిశ్రమలో ప్రమాదాలు

కాజిపల్లి హెటీరో ల్యాబ్స్ పరిశ్రమలో గతంలోనూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాలు ఉన్నాయి. దాదాపు 8 నెలల క్రితం ఇదే పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు.అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్న నియంత్రణ చర్యలు తీసుకోవడంలో యజమాన్యం తో పాటు పి సి బి, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. కేవలం ధనార్జనే ధ్యేయంగా కార్మికుల ప్రాణాలతో యాజమాన్యం చెలగాటమాడుతుందని పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టపగలు అర్ధరాత్రి అంటూ తేడాలు



లేకుండా ప్రమాదాలు జరుగుతున్న తీరును చూసి ఆయా శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యతగల అధికారులు మామూళ్ల మత్తులో తూలుతున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇక పరిశ్రమ నుంచి గతంలో పెద్ద ఎత్తున రాత్రి పగలు అంటూ తేడా లేకుండా రసాయన వ్యర్థ జలాలు అండర్ గ్రౌండ్ నాలాల



ద్వారా బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాల్లో గాయపడ్డ కార్మిక కుటుంబాలకు యాజమాన్యం అండగా నిలిచి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదాలను అరికట్టే విధంగా సత్వర చర్యలు తీసుకొని కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

# 23న దాతరపల్లి గురుకుల పాఠశాలలో

## విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు

## దాతర్ పల్లి గురుకుల. కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ



తూప్రాన్ మేజర్ న్యూస్: తూప్రాన్ మండలం దాతరపల్లి శివారులో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మూడో తేదీ నుండి పరీక్షలు ఏర్పాటు చేశారు ఇందులో ఐదవ తరగతి నుండి 9వ తరగతి వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ 23న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు, మరియు వి టి జి సి ఈ టీ 2025 పరీక్షల నిర్వహిస్తున్నట్లు ప్రతి విద్యార్థి ప్యాడ్, బ్లాక్ పెన్ను, రెండు ఫోటోలు, ఆధార్ కార్డు, తీసుకొని తూప్రాన్ మండలం దాతరపల్లి గురుకుల పాఠశాలకు ఉదయం 9 గంటల వరకు విద్యార్థి విద్యార్థులు సకలంలో హాజరై పరీక్ష సమయానికి రాగలరని దాతరపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు.

# లింగారెడ్డిపేట్‌లో గుప్త నిధుల తవ్వకాలు

## ముగ్గురుని అరెస్ట్ చేసిన పోలీసులు





తూప్రాన్ మేజర్ న్యూస్ : లింగారెడ్డిపేట శివారులో త్రిపుర వెంచర్లు గురువారం రాత్రి గుప్త నిధుల కోసం హైదరాబాద్ పంజాగుట్ట చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు, పోలీసుల వివరాల ప్రకారం చంద్రాయన్ గుట్టకు చెందిన ఇద్దరు ముస్లింలు బోయిన్పల్లి కి చెందిన ఒక వ్యక్తి కలిసి ముగ్గురు గుప్త నిధులు తోతుండగా పోలీసులకు సమాచారం ఇయ్యగా ఘటన స్థలానికి చేరుకొని గుప్తనిధుల కోసం పరికరాలను ఉపయోగించే పారలు గడ్డపారలు సామాగ్రిని పట్టుకొని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

# అంగన్వాడి కేంద్రంలో ఈ సి సి ఈ డే కార్యక్రమం



మద్దూర్/మేజర్ న్యూస్ : మండలంలోని లింగాపూర్ గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు ఇ,సి,సి,ఇ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిసి సూపర్వైజర్ రేణుక సిఆర్పి ఉమాదేవి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో నెలరోజుల వ్యవధిలో విద్యార్థిని విద్యార్థులకు నేర్పించిన ఆటలు పాటలు కథలు సృజనాత్మకత పై తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటుచేసి విద్యార్థుల నైపుణ్యాన్ని తల్లిదండ్రుల ముందు ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఉమాదేవి అంగన్వాడి టీచర్లు జ్యోతి విజయ ఆయాలు మనం మా లక్ష్మి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

### - మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

గజ్వేల్ మేజర్ న్యూస్ : గజ్వేల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం నాడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి చేతుల మీదుగా మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రేఖాగౌడ్ ఆధ్వర్యంలో నర్సారెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ గౌడ సమాజం అభివృద్ధి కోసం మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి చేస్తున్న కృషి అభినందనీయమని, ఒక మహిళగా ఉండి అటు వ్యాపారంలో ఇటు గౌడ సమాజం అభివృద్ధి కోసం తన వంతు పాత్ర వహిస్తూ పలువురి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ రేఖ గౌడ్ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని నర్సారెడ్డి అన్నారు. గౌడ సమాజం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, నాయకులు



విరూపాక్ష శ్రీనివాస్ రెడ్డి, మోహన్, సమీర్, చిట్యాల శివారెడ్డి, మల్లారెడ్డి, శంకర్ గుప్త,స్వామి,అరుణ్ కుమార్, శ్రవణ్, గణేష్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోస్ట్ ఆఫీస ఉద్యోగుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి ఘన సన్మానం

గజ్వేల్ మేజర్ న్యూస్ : గజ్వేల్ మున్సిపాలిటీలోని పోస్ట్ ఆఫీస్ ఐఓసీ భవనంలో మొదటి అంతస్తులో ఉండడంతో పోస్ట్ ఆఫీస్ ఖాతాదారులు అలాగే వృద్ధులైన పెన్షన్ దారులు చాలా ఇబ్బందుల గురి అయ్యారు. ఇట్టి విషయంలో నర్సారెడ్డి చొరవ తీసుకొని కలెక్టర్ తో మాట్లాడి పోస్ట్ ఆఫీస్ ను అందరికీ అణువుగా ఉండేట్టు గ్రౌండ్ ఫ్లోర్లో ఏర్పాటు చేయించడం జరిగింది. దీనితో అటు ఖాతాదారులు ఇటు పోస్ట్ ఆఫీస్ ఉద్యోగులు కూడా సంతోషించి ఈ విషయమై నర్సారెడ్డిని కలిసి ఆయనకు కృతజ్ఞత తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సెక్రెటరీ సాజీద్ బేగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, డైరెక్టర్ డాక్టర్ వహీద్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ ,మైనారిటీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ సమీర్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు జాంగిర్, యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ నేత నాగరాజు, ధర్మారెడ్డి పల్లి మాజీ



సర్పంచ్ సుఖేందర్ , గుంటుకు శ్రీనివాస్, జంగం రమేష్ గౌడ్, చెప్యాల శేఖర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 19 రాష్ట్రాల నుండి 77 టీమ్స్ తో ఈబాహా బగ్గీల పోటీలు..









నర్సాపూర్ సూర్యా మేజర్ న్యూస్ : నర్సాపూర్ పట్టణ సమీపంలో నీ “బి వి రాజు ఇన్స్టిట్యూట్ టెక్నాలజీ కళాశాలలో జరుగుతున్న (బివిఆర్ఐటి) ఈ బాహా కేటగిరీ కోసం ఎస్ఏఈ బాహా సే ఇండియా 2025 పోటీలలో శుక్రవారం నాడు రెండొవ రోజు టెక్నికల్ విషయాల పైన పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీలలో 85 టీమ్స్ దరఖాస్తు చేస్తున్నారు,అందులో 77 విద్యార్థిని విద్యార్థుల టీమ్స్ పాల్గొంటున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం -2, మహారాష్ట్ర -23, తమిళనాడు-17, తెలంగాణ-2, కేరళ-7, ఢిల్లీ-1, ఒడిశా-2, మధ్యప్రదేశ్ -5, ఉత్తరప్రదేశ్ -3, గుజరాత్ -4, కర్ణాటక-4, ఉత్తరాఖండ్ -1, త్రిపుర-1, కర్ణాటక-4, ఛత్తీస్గఢ్ -1, చండీగఢ్ -1, జారఖండ్ -1, జమ్మూ కాశ్మీర్ -1 హరియాణా-1 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారు. మన




దేశంలోని 19 రాష్ట్రాలకు చెందిన ప్రతిష్టాత్మక మైన విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీ, పేరు పొందిన యూనివర్సిటీ ల నుండి 77 విద్యార్థుల చేత సొంతగా డిజైన్ చేసుకొని వచ్చి వారి బగ్గీలలతో ఈ బాహా ఎస్ ఏ ఈ ఇండియా 2025 నందు పాల్గొటున్నారు. ఈ బగ్గీలకు సాంకేతిక తనిఖీలు, బ్రేక్ టెస్ట్, వర్షపు తుఫాను పరీక్షలు, డిజైన్ ఫైనల్స్, ఆవిష్కరణలు, ధ్రువీకరణ, ద్రోణాచార్య త్వరణం, డైనమిక్ సంఘటనలు నిర్వహించడం జరుగుతోందని ఆర్గనైజింగ్ కమిటీ ఇ బాహా సే ఇండియా తెలియజేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించిన గృహ పిడి అధికారి దామోదర్ రావు



కుకునూరుపల్లి,మేజర్ న్యూస్:ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించిన గృహ పిడి అధికారి దామోదర్ రావు. కుకునూరుపల్లి మండల పరిధిలోని మెదినిపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆదివారం నుండి ప్రారంభిస్తామని దీనిలో భాగంగా లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎవరెవరు అర్హులు ఇంటి నిర్మాణం ఎలా చేపట్టాలి,ఎన్ని నిధులు వస్తాయి,ఎంత ఖర్చు అవుతుంది. వంటి అంశాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పలువురు గ్రామస్తులు పలు సందేహాలు వ్యక్తం చేశారు వారికి పిడి సావధానంగా సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు, రాంప్రసాద్ కార్యదర్శి ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనంపై ఊట్ల టు ప్రయాగ్రాజ్



జిన్నారం మేజర్ న్యూస్:బైక్ పై ప్రయాగ్రాజ్ ఊట్ల గ్రామానికి చెందిన సాయికుమార్, లక్ష్మణ్ అనే ఇద్దరు యువకులు ఈ నెల 18వ తేదీన చాకలి మెట్లలో ప్రత్యేక పూజలు నిర్వహించి ద్విచక్ర వాహనంపై ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న ప్రయాగ్రాజ్ మహా కుంభమేళకు వెళ్లారు. దాదాపు 1450 కిలోమీటర్లను కేవలం 22 గంటల్లోనే గమ్యస్థానం చేరుకున్నారు. హిందూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఈ యాత్రను చేపట్టినట్లు యువకులు వెల్లడించారు. యువకులు తలపెట్టిన మహాకార్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.

# వైభవంగా ఆత్మలింగ శివాలయ ప్రాణ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం



పెద్ద శంకరంపేట్.. మేజర్ న్యూస్ : పెద్ద శంకరంపేట మండల పరిధిలోని గొట్టిముక్కుల గ్రామంలో నూతనంగా నిర్వహించిన ఆత్మలింగ శివాలయ ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.. ఉదయం నుండి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో గణపతి పూజ గోపూజ.. యాగ ప్రవేశం రిత్విక్ వర్ణం రక్షబంధనం.. ద్వారక పూజ నవగ్రహ పూజ .. హోమం తదితర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.. ఆలయాన్ని వివిధ రకాల పూలతో సర్వంగ సుందరంగా తీర్చిదిద్దారు.. ఈ కార్యక్రమంలో తోగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి మండల తాసిల్దార్ గ్రేసీ బాయ్.. డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్ . గొట్టిబుక్కుల గ్రామస్తులు మహిళలు. పిల్లలు పెద్దలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మొదటి విజయంతో ఆత్మవిశ్వాసం పెంచింది

### మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు

### & ఏకలవ్య కబడ్డీ క్లబ్ అధ్యక్షులు రాజబోయిన కృష్ణ యాదవ్



మర్కుక్ మేజర్ న్యూస్ : వికారాబాద్ జిల్లాలో జరుగుతున్న 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల బాల బాలికల కబడ్డీ ఛాంపియన్షిప్ లో సిద్దిపేట జిల్లా సబ్ జూనియర్ బాలుర జట్టు పెద్దపల్లి జట్టుపై మొదటి విజయం సాధించడంతో ఆత్మవిశ్వాసం పెంచిందని మర్కుక్ మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల నుండి సిద్దిపేట జిల్లా బాలుర జట్టుకు ఏకలవ్య కబడ్డీ క్లబ్ శిక్షణ నిచ్చి పంపడం జరిగిందని మొదటి విజయం సాధించిన బాలుర జట్టుకు శుభాకాంక్షలు తెలుపుతున్నానని, పెద్దపల్లి జిల్లా జట్టుపై 20 పాయింట్ల తేడాతో సిద్దిపేట బాలుర జట్టు గెలుపొందడం సంతోషం అన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- మాల్ ప్రాక్టీస్ కు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలి
- పరీక్షా కేంద్రాల్లో కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలి
- జిల్లాలో 43 పరీక్షా కేంద్రాలు
- 20595 హాజరు కానున్న విద్యార్థులు
- మొదటి సంవత్సరం 9770 మంది విద్యార్థులు
- ద్వితీయ సంవత్సరం 10815 మంది విద్యార్థులు : జిల్లా కలెక్టర్.ఏం.మను చౌదరి






సిద్దిపేట ప్రతినిధి, మేజర్ న్యూస్ : ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ ఏం.మను చౌదరి శుక్రవారం రోజున పోలీస్ కమీషనర్ అనురాధ తో కలిసి జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుండి మార్చి 25 వరకు ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 43 పరీక్షా కేంద్రాల్లో 20595 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు 9770, సెకండ్ ఇయర్ 10815 మంది ఉన్నారన్నారు.

పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి,ఇందుకోసం కస్టోడియన్ మరియు డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు.విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు,తగిన మందులతో మెడికల్ ఆఫీసర్, ఆశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరిమా అగ్రవాల్, రెవిన్యూ అబ్దుల్ హమీద్ ఆర్డీఓలు సధానందం, చంద్రకళ, అడిషనల్ డిసీపీ సుభాష్ చంద్రబోస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ రెడ్డి, డిఇఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పల్వాన్ కుమార్ ,విద్యుత్ శాఖ ,ఆర్టీసీ, పోస్టల్, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఝరాసంఘం జాతరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

- జాతర ఏర్పాట్లలో ఎలాంటి లోటు పాట్లు ఉండొద్దు.
- జాతరలో ప్లాస్టిక్ వాడకం పై పూర్తిగా నిషేధించాలి.
- జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి.
- జాతరలో శానిటేషన్ సమస్య తలెత్తకుండా చూడాలి.
- తాగునీటి వసతి, మరుగుదొడ్ల ఏర్పాటు ,జాతర పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలి.
- భక్తుల సంఖ్యకు అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలి.
- ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు భక్తుల రద్దీకి తగ్గట్లు ఏర్పాటు చేయాలి.
- జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష.



సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నాలుగు రోజులపాటు జరిగే ఝరాసంఘం కేతకి సంగమేశ్వర స్వామి జాతరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు.ఝరాసంఘం కేతకి సంగమేశ్వర స్వామి జాతరకు సంబంధించి ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో జాతరలో చేస్తున్న ఏర్పాట్లను అధికారులు కలెక్టర్ వివరించారు. జాతరకు సుమారు రెండు లక్షల పైచిలుకు భక్తులు తెలంగాణ కర్ణాటక మహారాష్ట్ర ల నుండి వచ్చే అవకాశం ఉన్నందున భక్తుల రద్దీకి అనుగుణంగా జాతర ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. జాతర సందర్భంగా ఆర్టీసీ అధికారులు ఆయారూట్లలో ప్రత్యేక బస్సు సర్వీస్ లో నడపాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో జాతర కు ప్రజలు వచ్చే మార్గాలలో రోడ్ల మరమ్మత్తు పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గ్రామీణ మంచినీటి సరఫరా మిషన్ భగీరథ ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి వసతి ఏర్పాట్లు, పంచాయతీ రాజ్ శాఖ తరుపున మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లకు అవసరమైన మరమత్తు పనులు చేపట్టడంతో పాటు తాత్కాలిక మరుగుదొడ్లు సైతం ఏర్పాటు చేయాలని, రన్నింగ్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో జాతరలో శానిటేషన్ పనులు పర్యవేక్షించాలన్నారు జాతర సమయంలో జాతర పూర్తయిన తర్వాత జాతర జరిగిన ప్రదేశం మొత్తం శానిటేషన్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆలయపు సమీపంలో భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని చాలువ పందేలు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులకు ఆదేశించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బద్దో బస్సులు ఏర్పాటు చేయాలని నిరంతరం సీసీ కెమెరాలుతో జాతరలో నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేయాలని, జాతరకు వచ్చే ప్రజల్లో తప్పిపోయిన చిన్నపిల్లల ను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడం కోసం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి క్యాంపు ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జాతర ప్రదేశాలలో ప్రత్యేక హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది 24 గంటల పాటు క్యాంపులో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని వైద్యధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాతరలో 24 గంటల పాటు విద్యుత్ సౌకర్యం కల్పించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ట్రాన్స్కో సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. జాతరకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను ఎంపిక చేయాలని ఆ వివిధ మార్గాలలో వచ్చిన భక్తులు పార్కింగ్ చేసుకునేలా ప్రత్యేక స్థలాలను కేటాయించాలని అధికారులకు సూచించారు. భక్తులు ఆలయం వరకు వాహనాల్లో రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆలయం సమీపంలో గ్రామంలోని ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందు అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్, రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాతర సందర్భంగా ఆలయ సందర్శనకు వచ్చి వీఐపీలకు, సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దర్శన ఏర్పాట్లు చేయాలన్నారు.జాతర విధులకు కేటాయించిన సిబ్బంది అందరూ తమ కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించి జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశం లో , ట్రైనీ కలెక్టర్ మనోజ్, డి ఆర్ ఓ పద్మజ రాణి, డి పి ఓ సాయిబాబా, ఎస్సీ మిషన్ భగీరథ్ రఘువీర్, ఈ ఈ పి ఆర్, జగదీష్, జహీరాబాద్ ఆర్ డి ఓ రాం రెడ్డి, టెంపుల్ కార్యదర్శి శివరుద్రప్ప, ఆయా మండల ఎంపిడిఓ లు, ఎంపీఓ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్టు రిమాండ్‌కు తరలింపు : సిద్దిపేట ఏసీపి మధు





సిద్ధిపేట:మేజర్ న్యూస్: సిద్ధిపేటలోని స్థానిక నర్సాపూర్ చౌరస్తాలో బోదాసు శ్రీనివాసును హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేశామని శుక్రవారం సిద్ధిపేట టూ టౌన్ సిఐ ఉపేందర్ తో కలిసి పత్రికా ప్రకటన ద్వారా సిద్ధిపేట ఏసీపి మధు కేసు వివరాలు వెల్లడించారు.పర్వతం రాజు తండ్రి పెంటయ్య,వయస్సు 40 సంవత్సరాలు, నివాసం బుడిగె జంగాల కాలనీ,రేకుర్తి గ్రామం,కరీంనగర్.సిద్ధిపేట పట్టణంలోని స్థానిక కెసిఆర్ నగర్ కి చెందిన బోదాసు సంధ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసును విచారించగా ఎన్నో విషయాలు తెలిశాయన్నారు. సంధ్య భర్త బోదాసు శ్రీనువాసును హత్య చేసిన నిందితుడు పర్వతం రాజు యొక్క తండ్రి పెంటయ్యకు మృతుడు బోదాసు శ్రీనివాస్ కు మధ్య స్నేహం ఉందని నిందితుడు గత కొంతకాలంగా తన బార్య పిల్లతో దూరంగా ఉంటున్నాడని తెలిపారు.ఈనెల 19న నిందితుడికి మృతుడు బోదాసు శ్రీనివాస్ కనిపించగా తనిని నర్సాపూర్ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలోకి తీసుకెళ్లి శ్రీనివాస్ కు బాగా మద్యం తాగించి అతను తాగి పడిపోగానే ఆతనితో హెూమో సెక్స్ చేస్తుండగా శ్రీనివాస్ కి మెలుకువ వచ్చి ఇలా చేస్తున్నావేమిటని రాజుతో ప్రతిఘటించగా నిందితుడు రాజు శ్రీనివాస్ ను కర్రతో కొట్టి చంపి అక్కడి నుండి పారిపోయాడని శుక్రవారం సిద్ధిపేట టూ టౌన్ సిఐ ఉపేందర్ తన సిబ్బందితో కలిసి నిందితున్ని గాలించి పట్టుకొని విచారించి అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు పంపించారని తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బెజ్జంకి,సూర్యన్యూస్: మండల పరిధిలోని ముత్తన్నపేట గ్రామానికి చెందిన బొర్ర బుచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యుడు స్వేరోస్ నెట్ వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొర్ర సురేష్ కుమార్ ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతురాలు చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు.బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి,నాయకులు లింగాల లక్ష్మణ్,శ్రీనివాస్ గుప్తా,కనగండ్ల తిరుపతి,ఎలా శేఖర్ బాబు తదితరులు ఉన్నారు.



# పోటీతత్వం అలవర్చుకుంటే ఆశించిన ఫలితాలు

పెద్దశంకరంపేట మేజర్ న్యూస్ : విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుంటే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తును తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. క్రమశిక్షణతో చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని పర్యావసనాలకు దూరంగా ఉంటే భవిష్యత్తులో ఉన్నతశిఖరాలు అదిరోహించవచ్చన్నారు. తల్లి దండ్రులు ఎంతో కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకొని కళాశాలకు పంపిస్తున్నారని క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, బృందనృత్యాలు, పాటలు పలు ప్రదర్శనలు పలువురిని అలరించి విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు హరిత, అనంత్జ్, ప్రభాకర్,



రమేష్, రాజు, శ్రీశైలం, మల్లేశం, జహీరాబేగం, కిష్టారెడ్డి, విజయభాస్కర్, శ్రీలత, అశ్విని, తదితరలున్నారు.

# కాలి బూడిదైన ఈత చెట్లను పరిశీలించిన గజ్వేల్ సిఐ బి సైదా

### - సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

గజ్వేల్ మేజర్ న్యూస్ : గుర్తుతెలియని వ్యక్తులు ఈత చెట్లను కాల్చడంతో అహ్మదిపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ కొత్త పల్లి నర్సగౌడ్ ,వైస్ ప్రెసిడెంట్ బోర్రనా సత్యనారాయణ గౌడ్, సభ్యులు కొత్తపల్లి వెంకటేష్ గౌడ్, కొత్తపల్లి బాల్ రాజు గౌడ్, కొత్తపల్లి బాలు గౌడ్ , కొత్తపల్లి చిన్న వెంకట్ గౌడ్, గజ్వేల్ సీఐ సైదాకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన గజ్వేల్ సీఐ సైదా శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి ఈత చెట్లను దహనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈత చెట్లను కాల్చిన వ్యక్తులు ఎవరైనా సరే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎల్లమ్మ గుడి దగ్గర చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల వలన ఎలాంటి నేరాలు జరగకుండా అరికట్టడానికి సిసి కెమెరాలు సహాయ పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం సభ్యులు రామ గౌడ్, బాల్ నర్స్ గౌడ్, జగన్ గౌడ్, అంజా గౌడ్, ముత్యం



గౌడ్, నాగ మల్లయ్య గౌడ్, దుర్గయ్య గౌడ్, వెంకట్ గౌడ్, నర్సింలు గౌడ్, లింగ గౌడ్, ఎల్లగౌడ్, లక్ష్మణ్ గౌడ్, రాములు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, స్వామి గౌడ్, సిల్వేరి బాలరాం గౌడ్, వేంకట్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కస్తూర్భా పాఠశాలను సందర్శించిన అడిషనల్ డిఆర్డిఏ బాలకిషన్

మర్కుక్ మేజర్ న్యూస్: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను శుక్రవారం జిల్లా అడిషనల్ డిఆర్డిఏ మర్కుక్ మండల స్పెషల్ ఆఫీసర్ బాలకిషన్ ఎంపీడీవో అశోక్ కుమార్ తో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులు, ఉపాధ్యాయుల బోధన విధానం, భోజన వసతులు, పోషక ఆహారం తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన వసతులను పరిశీలించి మరుగుదొడ్లు, తాగు నీరు, ల్యాబ్, లైబ్రరీ తదితర సదుపాయాల కల్పన విషయాలను పాఠశాల ఎస్ ఓ భాగ్యలక్ష్మీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదోతరగతి సార్వత్రిక పరీక్షల్లో బాలికల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కస్తూర్బా విద్యాలయాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని చదువులో వెనుకబడిన బాలికలను గుర్తించి వారికి అవసరమైన తర్ఫీదు ఇస్తూ ప్రత్యేక తరగతులు చేపడుతూ విద్యార్థినుల ఉత్తీర్ణత శాతం మెరుగుపడే విధంగా చూడాలని పాఠశాల ఎస్ఓ కు సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యను జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లి



పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి ఎం పి ఓ శాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆభాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, టి ఏ స్వామి తదితరులు ఉన్నారు.

# అక్రమంగా దాచిపెట్టిన 50.400 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్న టాస్కోఫ్స్ పోలీసులు



దుబ్బాక సూర్య మేజర్ న్యూస్: దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పనపల్లి గ్రామంలో మెరుపుల సత్యనారాయణ గౌడ్ ఇంటిలో ఎలాంటి ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నడుపుచున్నాడని నమ్మదగిన సమాచారం పై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు సిబ్బంది దుబ్బాక పోలీసులు వెళ్లి ఇంటిలో తనిఖీలు నిర్వహించగా బీర్లు విస్కీ బాటిల్ లు లిక్కర్ బాటిల్ అందాజ మొత్తం 50.400 లీటర్ల మధ్యన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశానుసారం జిల్లాలో అక్రమ వ్యాపారాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన బెల్ట్ షాపులు నడిపిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలుజరుగుతుందని తెలిపారు. గ్రామాలలో పట్టణాలలో ఇసుక అక్రమ రవాణా చేసిన పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన బెల్ట్ షాపులు నడిపిన గ్యాంబ్లింగ్ పేకాట ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు కలిగి ఉన్నా రవాణా చేసిన మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# ఘనంగా స్వయం పాలన దినోత్సవం



పెద్ద శంకరంపేట మేజర్ న్యూస్ : మండల పరిధిలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాడు విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవన్నీ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవోగా ఆంజనేయులు. ఎంఈఓ గా శివకుమార్. ప్రధానోపాధ్యాయులుగా నరసింహ గౌడ్. ఉపాధ్యాయులుగా సుస్మిత. వైష్ణవి. తుకారం. పరుశురాం. చిరంజీవి. మురళీకృష్ణ. రాజు. లోకేష్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుష్మ. ఉపాధ్యాయులు ఆనంద్. స్రవంతి. సచిన్ కుమార్లు పర్యవేక్షించారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



పెద్ద శంకరంపేట మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలో శుక్రవారం కేంద్రానికి చెందిన వడ్డే రమేష్ మరియు పట్టణానికి చెందిన వడ్డే నాగయ్య గారి తమ్ముడి కూతురి వివాహనికి మరియు మండలంలోని సంగారెడ్డి పేట గ్రామానికి చెందిన కుర్మ రాములు కుమారుడు అంజయ్య వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూతురు మహారెడ్డి శ్రేయ రెడ్డి,మాజీ రైతుబంధు అధ్యక్షులు సురేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రమేష్, బూత్కూరి సుభాష్, నాయకులు శనిగారి మల్లయ్య, లోక కిషన్, సంగ్రామ్, శనిగారి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# సర్వత్రా హెూరెత్తుతున్న నిరసనలు



గుమ్మడిదల మేజర్ న్యూస్:గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ ప్యారానగర్ శివారులో డంపుయార్డు పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ డంపుయార్డు వ్యతిరేక సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గుమ్మడిదల మండలం దార్గుళ్ల గ్రామ రైతులు 17వ రోజు శుక్రవారం రిలేనిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డంపుయార్డు పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోవర్ధన్, రాయపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మహిళల నిరసన ర్యాలీ

గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ ప్యారానగర్ శివారులో జీహెచ్ఎంసి ఏర్పాటు చేయనున్న డంపు యార్డు పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గుమ్మడిదల మండల కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో రైతులు, మహిళలు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డంపు యార్డు ఏర్పాటును వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలు నిరసనకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మనిషి అస్తిత్వాన్ని నిలబెట్టేదే మాతృభాష

సిద్ధిపేట:మేజర్ న్యూస్: ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో విద్యార్థులు మాతృభాషలో మాట్లాడటాన్ని నిషేధించుట,శిక్షలు వేయటం,దండుగలు వసూలు చేయుట ఆపినప్పుడే విద్యార్థుల్లో సృజనాశక్తులు పెరుగుతాయని కావున ఇటువంటి పెడధోరణి అవమానకర విధానాలు మనం మార్చుకోవాలని సూచించారు పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాల తెలుగుశాఖ సహాయ ఆచార్యులు కంజర్ల శ్రీలత.శుక్రవారం సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు విభాగం ఆధ్వర్యంలో మాతృభాష పరిరక్షణ,కర్తవ్యాలు అనే అంశంపై జరిగిన ప్రత్యేక భాషాత్మక సమావేశానికి వక్తగా హాజర్కెన శ్రీలత కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి మాట్లాడుతూ వర్తమాన సమాజంలో భాషలపై తగినంత ప్రేమ అవగాహన కోల్పోతున్నామని,దాని పర్యవసానం జాతి జీవనాడిని దెబ్బతీస్తుందన్నారు. కనుక మాతృభాషలపట్ల ప్రజలూ, స్వచ్ఛంద సంస్థలూ కలిసి చైతన్యం చేయవలసిన అవసరం ఉందన్నారు.కళాశాల ప్రధానాచార్యులు సునీత మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు వివిధ రాష్ట్రాలలో చదువుతూనే ఇంట్లో మాతృభాష నేర్చుకుని ఎదిగివచ్చారని తనూ కూడా ఆ కోవకే చెందిన వ్యక్తిగా వివరించారు. తెలుగు శాఖ అధ్యక్షులు డా.మట్టా సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మన శక్తియుక్తులు వ్యక్తీకరణ జీవన తాత్త్వికత అన్నీ భాషతో ముడిపడి వుంటాయని భాషను పోగొట్టుకుంటే సర్వం కోల్పోయినట్టేనని గ్రహించాలని చెప్పారు.తెలుగు అధ్యాపకులు పిట్ల దాసు మాట్లాడుతూ జాతి అస్తిత్వాన్ని నిలబెట్టుకొనుటకు భాషే ఏకైక సాధనమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు నారోజు వెంకటరమణ,సంపత్ కుమార్,శైలజ,రామస్వామి,నరేశ్, నర్సింహులు,సాయి సురేశ్,రమణ, డిగ్రీ,పీజీ విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.



## వ్యర్థాల శుధికరణను సద్వినియోగం చేసుకోండి :మున్సిపల్ కమిషనర్ ఎం శ్రీనివాస్ రెడ్డి



దుబ్బాక సూర్యమేజర్ న్యూస్: ఇళ్ల నుంచి వచ్చే మానవ ఘన వ్యర్థాలను శుద్ధిచేసి ఎరువుగా మార్చి వాటిని ఉపయోగించుకునేందుకే పురపాలికలో ఎఫ్ఎస్టిపి (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ –మానవ ఘన వ్యర్థాల శుద్ధికరణ కేంద్రం)ను ప్రారంభించామని దుబ్బాక పుర కమిషనర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం దుబ్బాక పట్టణ శివారులో నూతనంగా రూ.73 లక్షలతో నిర్మించి ప్రారంభించిన ఎఫ్ఎస్టిపి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి కేంద్రంలోని శుద్ధికరణ యంత్రాల పనితీరు ఎరువుల తయారీ నిర్వహణను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నివాస గృహాల్లోని సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించిన మానవ విసర్జితాలను ఊరి చివరన చెరువుల చివరన ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో పర్యావరణానికి తీవ్ర హాని కలగడంతో పాటు ఆ ప్రాంతాలు తీవ్ర దుర్వాసనతో నిండిపోతున్నాయన్నారు. అందుకే ఈ సమస్యను దూరం చేసేందుకు మానవ ఘన వ్యర్థాలను ట్యాంకుల ద్వారా తీసుకువచ్చి ఎఫ్ఎస్టిపి కేంద్రంలో ఎరువులుగా మార్చే ప్రక్రియను చేపడుతున్నామన్నారు. ఈ ఎరువులను మొక్కల పెంపకానికి పంట పొలాల్లో వ్యవసాయ ఉత్పత్తుల అధిక దిగుబడి పెంచేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. దుబ్బాక దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సేకరించిన ఘన వ్యర్థాలను సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ యజమానులు వారి వాహనాల్లో ఎఫ్ఎస్టిపి కేంద్రానికే తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం పురపాలిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించి అక్కడి మొక్కలకు నీళ్లు పోశాడు. నర్సరీలో పూర్తిగా ఎండిపోయిన మొక్కలను తొలగించాలని, మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పురపాలిక ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ బుస్స ప్రవీణ్, పుర సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఇసుక డంపులు స్వాధీనం చేసుకున్న పోలీసులు

కుకునూరుపల్లి,మేజర్ న్యూస్: అక్రమ ఇసుక డంపుల పై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ కుకునూరు పల్లి పోలీసులు కొరడా ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కుకునూరు పల్లి మండల పరిధిలోని మంగోల్ గ్రామ శివారులో మరియు కుకునూరుపల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర రెడ్డి మిక్స్ కంపెనీలో,కొత్తం రాజేశ్యామ్,నివాసం గజ్వేల్,మరియు ఇటుక బట్టీలు చిరుకూరి నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా 200 టన్నుల ఇసుకను అక్రమంగా డప్పు చేసి ఎక్కువ ధరలకు నిక్రయిస్తున్నారని తెలిపారు. శుక్రవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు కుకునూరు పల్లి పోలీసులు కలసి ఇసుక డంప్లపై రైడ్ చేసి ఇసుకను స్వాధీనం





చేసుకొని కేసు నమోదు చేసే విచారణ జరుపుతున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతు లేకుండా ఇసుక మట్టి మొరము పిడిఎస్ రైస్ అక్రమంగా రవాణా చేసి నిలువ చేసిన చర్యలు తప్పమన్నారు మరియు పేకాట జూదం గంజాయి ఇతర మత్తు పదార్థాలను విక్రయించిన కలిగివున్న వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లు సమాచారం ఉంటే వెంటనే టాస్క్ ఫోర్స్ పోలీసులకు 8712667445,8712667447 సమాచారం అందించాలనివారిని కోరారు.సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

-ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే



బెజ్జంకి,సూర్యన్యూస్: పట్టపద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరు నరేందర్ రెడ్డిని గెలిపించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాక సమావేశానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.పట్టభద్రుల సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తామన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరు నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,ఆయా అనుబంధ విభాగాల అధ్యక్షులు,నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మద్దూర్/మేజర్ న్యూస్: మండల కేంద్రంలోని ఏఆర్ ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న బాల్య వివాహాన్ని శుక్రవారం అధికారులు అడ్డుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మద్దూరు మండలంలోని గాగిలాపూర్ గ్రామానికి చెందిన ఓ మైనర్ అమ్మాయితో రేబర్తి గ్రామానికి చెందిన ఓ అబ్బాయి తో బాల్య వివాహాన్ని జరిపిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందినట్లు తెలిపారు. దీంతో సిడిపిఓ రమాదేవి తహసిల్దార్ ఏజి రహీం ఎస్సై షేక్ మహబూబ్ ఆర్ఐ రమేష్ సూపర్వైజర్ పుష్పలత లు కళ్యాణ మండపానికి వెళ్లి వివాహాన్ని నింపివేశారు. అమ్మాయికి 18 ఏళ్లు నిండలేదని అధికారులు నిర్ధారించి అమ్మాయి అబ్బాయి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మేజర్లు అయినా తర్వాతే వివాహం జరిపిస్తామని తిరువర్గాల నుంచి అధికారులు నిఖితపూర్వకంగా హామీ పత్రాన్ని తీసుకున్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరిపిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన వైద్య కమిషనర్



తూప్రాన్, మేజర్ న్యూస్ : తూప్రాన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఉదయం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ జే. అజయ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూప్రాన్ ఆసుపత్రికి వచ్చిన ఆయన ఆస్పత్రి లోని ఔట్ పేషంట్స్, ఇన్–పేషంట్స్, ఫార్మసీ, ల్యాబ్ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్ సింగ్, సిబ్బంది ఉన్నారు.

## పోచమ్మ తల్లి భాగవతం ధార్మిక కార్యక్రమాలకు చిరునామా ఎన్కేపల్లి గ్రామం



సదాశివపేట సూర్య మేజర్ న్యూస్ : సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఎన్కేపల్లి గ్రామం నందు నల్ల పోచమ్మ జీవిత చరిత్ర భాగవత ముగింపు కార్యక్రమానికి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, శాంతినికేతన్ విద్యాలయం కరస్పాండెంట్ మాలి పటేల్ ప్రభు పాల్గొని కార్యక్రమం లోని నల్ల పోచమ్మ జీవిత చరిత్ర భాగవతం ద్వారా ప్రజల్లో భక్తి భావాన్ని నింపుతూ ఆత్మస్థైర్యాన్ని పెంచుతున్నటువంటి నల్ల పోచమ్మ భాగవతం నేర్పిన పంతులు గొల్లపల్లి గ్రామస్తులు బంటు నర్సింలు ని ఘనంగా సన్మానించడం జరిగింది. అదేవిధంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం జరగడానికి వివిధ రకాల వేషధాలు వేసిన బృందానికి ప్రత్యేకంగా సన్మానం చేసి బహుమతులు ఇవ్వడం జరిగింది. కొన్ని నెలలుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం జరుగుటకు సహకరించిన భజన బృందానికి మరియు గ్రామ పెద్దలకు కూడా సన్మానించి పాఠశాల తరఫున జ్ఞాపిక అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాలిపటేల్ ప్రభు మాట్లాడుతూ పర మతాన్ని గౌరవిస్తూ మన మతాన్ని పూజించాలి మన సాంస్కృతి సాంప్రదాయాలు పూర్వ కాలం దేవి దేవతల చరిత్రలో మన చిన్నారులకు నేటి తరానికి తెలియజేస్తూ మన ఆనాటి ఔన్నత్యాన్ని గుర్తించే విధంగా ఇలాంటి భాగవతాలు మరియు ఆనాటి జీవిత విధానాలు నేటి తరానికి అందించి సన్మార్గం నడిపేందుకు కృషి చేయాలని అన్నారు. భాగవత కళాకారులకు సినిమా కళాకారులు సరికారు వీరి కృషి అమోఘం వర్ణాతీతం విరి నటన వీరు వేసే వేషం అన్నీ కూడా నిజమైనవే ఏలాంటి ఎడిటింగ్ లేకుండా ప్రత్యక్షంగా ప్రదర్శిస్తారు కాబట్టి ఇలాటి కళాకారులను అభినందించి ప్రోత్సహించాల్సిందే ప్రతి ఒక్కరం అని అన్నారు. ఈరోజు ఎక్కేపల్లి గ్రామంలో గ్రామస్తులు సహకరిస్తు ఇంత పెద్ద ఎత్తున మీరు పాల్గొనడం రాబోయే తరానికి మీరు మార్గదర్శనం అని అన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరికి ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ రాములు, గండయ్య దొడ్ల సోమయ్య, దొడ్ల సంగమేశ్వర్, దొడ్ల వెంకటేశం, గొల్ల అక్షయ్ కుమార్, ఎర్రగోళ నగేష్, బోయిని శంకరయ్య, కుమార్, లాలప్ప, మల్లేశం గ్రామంలోని యువకులు పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ పోచమ్మ తల్లి జీవిత చరిత్ర భాగవతం ముగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# స్వయం సహాయక సంఘాల మహిళలు ఇటుకల తయారీ, ఇండ్ల నిర్మాణం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు .

◆ న్యాక్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇండ్ల నిర్మాణం ఇటుకల తాయారు పై శిక్షణ.
◆ శిక్షణకు జిల్లాలో 118 మంది మహిళల ఎంపిక. ◆ మూడు విడతల్లో శిక్షణ.
◆ ఒక్కో విడుత లో 35 మంది మహిళలకు ఆరు రోజుల శిక్షణ.

సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి....ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం కోసం స్వయం సహాయక సంఘాల మహిళలకు న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్) ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు.



సంగారెడ్డి ప్రభుత్వ ఐటిఐ లోని న్యాక్ శిక్షణ కేంద్రం లో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇండ్ల నిర్మాణం, సిమెంట్ ఇటుకల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ప్రారంభించారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి మండలానికి ఐదు మంది చొప్పున ఆసక్తి అనుభవం ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇటుకల తయారీ , ఇండ్ల నిర్మాణం పై శిక్షణ కార్యక్రమాన్ని న్యాఖా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు



కలెక్టర్ తెలిపారు. ఒక్కో విడతలో 35 మందికి ఆరు రోజుల శిక్షణ ఇవ్వన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణ వల్ల గ్రామాలలో ఎక్కడికక్కడ ఇటుకలు తయారు చేసే యూనిట్లు నెలకొల్పడంతో పాటు మేస్త్రీలు అందుబాటులో ఉంటారన్నారు. దీంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థికంగా ప్రయోజనం కలగడంతో పాటు ఇందిరమ్మ ఇల్లా నిర్మాణం పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాలలో తక్కువ ధరకు నాణ్యమైన సిమెంట్ ఇటుకలు అందుబాటులో ఉంటాయన్నారు. మహిళలు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ మహిళలకు సూచించారు ఈ కార్యక్రమంలో న్యాక్ ఏపీడి రామ్, డి ఆర్ డి ఒ పిడి జ్యోతి , అదనపు డి ఆర్ డి ఒ జంగారెడ్డి , డి పి ఎం లు మహిళ స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సిబ్బంది పూర్తిస్థాయిలో

## అవగాహన కలిగి ఉండాలి: జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి




సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి....నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ / జిల్లాఎన్నికల అధికారి క్రాంతి వల్లూరు ఎన్నికల సిబ్బందికి సూచించారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలకు ఆడిటోరియంలో, మైక్రో అబ్జర్వర్లకు సమావేశ మందిరంలో వేరువేరుగా శుక్రవారం రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓ లకు బ్యాలెట్ బాక్సుల వినియోగ



విధానం, వాటికి సీల్ వేయడం, పోలింగ్ ప్రారంభానికి ముందే సిద్ధం చేయడం, పోలింగ్ ముగిసిన తర్వాత సీల్ వేసే విధానం తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యేకమైనవని, తడబాటు లేకుండా పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన శిక్షణను సీరియస్గా తీసుకోవాలని అధికారులు సూచించారు.ఎన్నికల నియమావళిని పూర్తిగా అనుసరించి , ఎలాంటి పొరపాట్లకు తావు కల్పించకూడదని సూచించారు. శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలన్నింటిని సమగ్రంగా అర్థం చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, ఎమ్మెల్సీ ఎన్నికల విధానం భిన్నంగా ఉంటుందని, బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించబడే ఈ ఎన్నికలకు ఎక్కువ సమయం పట్టే అవకాశముందని వివరించారు.పోలింగ్ ప్రారంభానికి ఒకరోజు ముందుగా 26వ తేదీ ఉదయం 8.00 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు, తమ బృందాలతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని, అక్కడ పోలింగ్ సామగ్రిని ఖచ్చితంగా పరిశీలించుకోవాలని సూచించారు, పోలింగ్ 27వ తేదీ ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు జరుగుతుందని, గడువు ముగిసిన తర్వాత



క్యూ లైన్లో ఉన్న వారికి టోకెన్ నెంబర్లు అందించి ఓటింగ్ పూర్తిచేయాలని సూచించారు.. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో గుంపుగా చేరుకోవడం, ర్యాలీలు, ఊరేగింపులు నిషేధం. అధికారుల అనుమతి లేకుండా ఎవరూ పోలింగ్ ఇదిగో ఇది ఉందా కేంద్రాల వద్ద ఉండకూడదని తెలిపారు.బ్యాలెట్ బాక్సులు, ఇతర మెటీరియల్ను చెక్లిస్ట్ ప్రకారం పరిశీలించుకోవాలి. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు. పోలింగ్ కేంద్రాల వద్ద సెల్ఫోన్లు అనుమతించబడవు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులు, పేపర్లు, సంబంధిత మెటీరియల్ను కరీంనగర్ రిసెప్షన్ సెంటర్లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులు, మైక్రోబ్సర్వర్స్ లదే అని స్పష్టంగా తెలియజేశారు.శిక్షణ కార్యక్రమం ను మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి , ఈ డి ఎస్ సి కార్పోరేషన్ రామాచారి , సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని మండల అధికారులతో పాటు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఓ.పీ.ఓలు ఎన్నికలసిబ్బంధి తదితరులు పాల్గొన్నారు.

# పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి అంత్యక్రియల్లో ,పాల్గొన్న ఎమ్మెల్యే



నిజాంపేట్ మేజర్ న్యూస్ : నారాయణఖేడ్ నియోజకవర్గం నిజాంపేట్ మండల గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాధా కిషన్ సెట్ తల్లి మ-రణించిన విషయం తెలుసుకొని శుక్రవారం వారి స్వగ్రహనికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యాన్ని చెప్పి అంత్యక్రియలో పాల్గొన్న ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ గౌడ్ తాజా మాజీ ఎంపిటిసి లింగారెడ్డి రాజు సెట్ శ్రీకాంత్ పండుగ కిష్టయ్య శ్రీకాంత్ మీస్కిన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కంటి దవఖనాను ప్రారంభించిన

## ఎమ్మెల్యే డాక్టర్.పి సంజీవరెడ్డి , డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి





నారాయణఖేడ్ మేజర్ న్యూస్ : నారాయణఖేడ్ నియోజకవర్గం మున్సిపల్ పట్టణంలో అశోక్ శేట్కర్ కాంప్లెక్స్ లో ముద్దసీర్ నూతనంగా ఏర్పాటు చేసిన నూతన కంటి దవఖనాను శుక్రవారం ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపిన ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి ఈ కార్యక్రమంలో వారి వెంట సీడీసీ చైర్మన్ సాదుల్ సాబ్ మండల పార్టీ అధ్యక్షులు తాహెర్ ఖాదర్, మోహిన్ ఖాన్, వెంకట్ రావు, కరీం డాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న

## ప్రభుత్వ ఉద్యోగులకు 27న సెలవు.



సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి...ఈనెల 27న జరగనున్న కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 27న రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించింది అన్నారు. కావున ఉద్యోగులు 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు.